క్లుప్తంగా

మజ్జిగ పంపిణీ

అమలాపురం టౌన్: స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చేపట్టిన పదో తరగతి పరీక్షల జవాబు పత్రాల మూల్యాకనంలో విధుల నిర్వర్తిస్తున్న 1,300 మంది ఉపాధ్యాయులకు ఆంధ్రప్రదేశ్ టీచర్స్ ఫెడరేషన్ (ఏపీ టీఎఫ్) జిల్లా శాఖ ఉపాధ్యాయులు మజ్జిగ ప్యాకెట్లను బుధవారం అందజేశారు. డీఈవో డాక్టర్ షేక్ సలీమ్ బాషా చేతల మీదుగా మజ్జిగ ప్యాకెట్ల పంపిణీ కార్యక్రమం ప్రారంభమైంది. ఏపీ టీఎఫ్ 1938 జిల్లా శాఖ ప్రధాన కార్యదర్శి యు.వెంకట్రావు, రాష్ట్ర కౌన్సిలర్ జీవీవీ సత్యనారాయణ ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు మూల్యాంనకనం సిబ్బంది దాహార్తిని తీర్చారు. డీవైఈవో గుబ్బల సూర్యప్రకాశం, జిల్లా పరీక్షల బోర్డు కార్యదర్శి బీర హనుమంత రావు, ఏపీ టీఎఫ్ జిల్లా ప్రతినిధులు గుత్తాల వెంకటేశ్వరరావు, మడికి నాగభూషణం, పినిపే కృష్ణమూర్తి పాల్గొన్నారు.

ఘనంగా సాయిబాబా ఆలయ వార్షికోత్సవం

ముమ్మిడివరం: ముమ్మిడివరం షిర్డి సాయిబాబా ఆలయ 25 వార్షికోత్సవాన్ని మూడురోజులుగా ఘనంగా నిర్వహించారు. సాయి బాబాకు మూడు రోజులపాటు ప్రత్యేక పూజలు, సత్యవ్రతాలు నిర్వహించారు. అనంతరం స్వామివారి ఆలయ ఆవరణలో భక్తులకు భారీ అన్న సమారాధన నిర్వహించారు.

న్యాయమూర్తి నరేష్‌కు సత్కారం

అమలాపురం టౌన్: అమలాపురం రెండో అదనపు జిల్లా కోర్టు న్యాయమూర్తిగా పనిచేసి బదిలీపై అనకాపల్లి జిల్లా న్యాయమూర్తిగా వెళుతున్న వి.నరేష్‌ను న్యాయవాది, ఎమ్మెల్సీ కుడుపూడి సూర్యనారాయణరావు బుధవారం ఘనంగా సత్కరించారు. నరేష్ జిల్లా రెండో అదనపు కోర్టు న్యాయమూర్తిగా జిల్లాలో ఎన్నో కేసుల్లో కీలక తీర్పులు ఇచ్చారని ఎమ్మెల్సీ గుర్తు చేశారు. ఎమ్మెల్సీ సూర్యనారాయణరావు తోపాటు న్యాయవాదులు కుడుపూడి త్రినాథ్, సంసాని అనిల్, ఎం.అచ్యుత తదితరులు జిల్లా న్యాయమూర్తి నరేష్‌ను సత్కరించారు.

ఘనంగా మందాలమ్మ జాతర

ఉప్పలగుప్తం: గొల్లవిల్లి పంచాయతీ పరిధి వాడపర్రులో గ్రామదేవత మందాలమ్మ వారి 54వ వార్షిక జాతరను బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారికి ఉదయం నుంచి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం అమ్మవారిని ఊరేగించారు. భక్తులకు అన్నసమారాధన ఏర్పాటు చేశారు.

నేడు మద్యం షాపులు మూసివేయాలి

యానాం: మహావీర్ జయంతిని పురస్కరించుకుని ఈనెల 10న గురువారం యానాంలో లిక్కర్‌షాపులు మూసివేయాలని బుధవారం ఆర్ఏఓ, డిప్యూటీ కమిషనర్ (ఎక్సైజ్) ఆర్ మునిస్వామి ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఈ సందర్భంగా లైసెన్స్‌లు కలిగిన లిక్కర్‌షాపులు, మద్యం పంపిణీ చేసే రెస్టారెంట్ అండ్ హోటళ్ల మూసివేయాలని కోరారు.

కిడ్నీ బాధితుడికి ఆర్థిక సాయం

అమలాపురం టౌన్: రెండు కిడ్నీలు పాడైపోయి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న కపిలేశ్వపురం మండలం అద్దంకివారి లంక గ్రామానికి చెందిన కార్తీక్‌కు గుడ్ సీడ్ ఫౌండేషన్ వైద్య ఖర్చుల నిమిత్తం రూ.15 వేల సాయంగా సమకూర్చింది. అమలాపురంలోని ఫౌండేషన్ కార్యాలయంలో వ్యవస్థాపకుడు, వైఎస్సార్‌సీపీ నాయకుడు కుంచే రమణారావు రూ.15 వేల చెక్‌ను రోగి కుటుంబ సభ్యులకు బుధవారం అందించారు. వైఎస్సార్‌సీపీ నాయకులు నేలపూడి సుగంధ కుమార్, పందిరి సుబ్బరాజు, గట్టెం వీరు తదితరులు పాల్గొన్నారు.

కట్నం వేధింపులపై కేసు

అమలాపురం టౌన్: కట్నం కోసం అత్తింటి వారు తనను మానసికంగా, శారీరకంగా వేధిస్తున్నారని అమలాపురం పట్టణంలోని కురసాలవారి వీధికి చెందిన అడ్డాల పద్మిని బుధవారం పట్టణ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. పశ్చిమ గోదావరి జిల్లా మొగల్తూరుకు చెందిన భర్త అడ్డాల నాగ వీర వెంకట సతీష్‌తో పాటు కుటుంబీకులు, బంధువులైన ఏడుగురు వేధిస్తున్నారని తెలిపింది. ఆమె ఫిర్యాదు మేరకు పట్టణ సీఐ పి.వీరబాబు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మహిళ అదృశ్యంపై కేసు నమోదు

ముమ్మిడివరం: కొత్తలంక గ్రామానికి చెందిన ఒక మహిళ మంగళవారం సాయంత్రం నుంచి కనిపించడం లేదని ఆమె కుటుంబ సభ్యులు ముమ్మిడివరం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఆ గ్రామానికి చెందిన పసుపులేటి కృష్ణవేణి (45) మంగళవారం ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదని, బంధువులు, తెలిసిన వారి ఇళ్ల వద్ద వెతికినా ఆచూకీ లభ్యం కాలేదని ఆమె కుమారుడు వీర హరి తెలిపారు. ఆమెకు భర్త, ఇద్దరు కుమారులు ఉన్నారు. ముమ్మిడివరం స్టేషన్ హెచ్‌ఓ జి.బైరవ స్వామి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఆమె ఆచూకీ తెలిసిన వారు సెల్. 9849918933కు సమాచారం ఇవ్వాలని ఆమే కుటుంబ సభ్యులు కోరుతున్నారు.

ముగ్గురు బెల్ట్ షాపు నిర్వాహకుల అరెస్ట్

అమలాపురంరూరల్: అమలాపురం, అంబాజీపేట మండలాల పరిధిలో బెల్ట్ షాపులు నిర్వహిస్తున్న ముగ్గురిని అరెస్టు చేసి తహసీల్దార్ కోర్టులో హాజరు పరిచినట్లు ఎక్సైజ్ సీఐ వీటీవీవీ సత్యనారాయణ తెలిపారు. అమలాపురం మండలంలో బెల్ట్ షాపులు నిర్వహిస్తున్న డేగల సత్యనారాయణ, గుత్తుల పల్లపు రాజు, అంబాజీపేట మండలంలో బెల్ట్ షాపు నిర్వాహకుడు తోట సుబ్రహ్మణ్యంను అరెస్టు చేసి బుధవారం అమలాపురం తహసీల్దార్ కోర్టులో హాజరు పర్చినట్టు ఎక్సైజ్ సీఐ తెలిపారు.

ప్రభుత్వ బడులు.. అపరిశుభ్ర పరిసరాలు

- కనీస వసతులు కరవు
- మరుగుదొడ్లు, పరిసరాలు అస్తవ్యస్తం
- విద్యార్థులకు అందని రక్షిత నీరు
- పాఠశాలల విజిట్‌లో బయటపడిన లోపాలు

కాట్రేనికోన: ప్రభుత్వ పాఠశాలల్లో అపరిశుభ్ర పరిసరాలు, అస్తవ్యస్తంగా మరుగు దొడ్లు, రక్షిత మంచి నీరు వంటి కనీస వసతులు లేక విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. మండలంలో 8 జెడ్పీ హైస్కూళ్లు, 16 యూపీ, 61 మండల పరిషత్ పాఠశాలలో సుమారు 5 వేల మంది పైబడి విద్యార్థులున్నారు. స్థానిక ప్రభుత్వ పాఠశాల్లో పని చేస్తున్న ఉపాధ్యాయులు, మండల విద్యాశాఖ అధికారులు మండల కేంద్రంలో నివాసం ఉండటం లేదు. కాకినాడ, రాజమండ్రి, రావులపాలెం, అమలాపురం, యానాం, ముమ్మిడివరం వంటి ప్రాంతాల్లో నివాసం ఉండి ప్రతి రోజు విధులకు హాజరవుతున్నారు. విద్యాశాఖ అధికారితో పాటు కొంత మంది ఉపాధ్యాయులు మండల కేంద్రంలో నివాసం లేకుండా ఇతర ప్రాంతాల నుంచి రావడంతో సకాలంలో పాఠశాలలకు హాజరు కావడం లేదని పలువురు అంటున్నారు.

విధి నిర్వహణలో నిర్లక్ష్యం

మండల పరిధిలోని పలు ప్రభుత్వ పాఠశాలలను బుధవారం దొంతికుర్రు, కందికుప్ప, పల్లంకుర్రు, చింతల చెరువు, సాపేవారి పేట, లైన్‌పేట, బక్కివారిపేట, వెంకమ్మ చెరువు, మొల్లేటి మొగ, కొత్తపాలెం పాఠశాలలను విజిట్ చేయడంతో అక్కడ నెలకొన్న లోటుపాట్లు బయటపడ్డాయి. కొన్ని పాఠశాలలకు కొంతమంది ఉపాధ్యాయులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తూ సమయానికి రాకపోవడం, ఒక పాఠశాలలో తరగతి గదిలో ఉపాధ్యాయుడు మొబైల్ ఫోన్‌లో నిమగ్నమవడం కారణంగా విద్యార్థులు బయటనే ఉండవలసిన పరిస్థితి దాపురించింది. అపరిశుభ్ర మరుగుదొడ్లు, చెత్త పేరుకుపోయిన పరిసరాలు పాఠశాలల్లో దర్శనమిచ్చాయి.



దొంతికుర్రులో ఉపాధ్యాయులు రావడం ఆలస్యం కాగా ఆయా తలుపులు తీయడంతో తరగతి గదిలో కూర్చున్న విద్యార్థులు



సాపేవారి పల్లి, మొల్లేటి మొగ పాఠశాలలో అపరిశుభ్రంగా మరుగుదొడ్లు



సాపేవారిపల్లి పాఠశాలలో విద్యార్థులు వినియోగించే మంచి నీటి ట్యాంకు

అపరిశుభ్రంగా పాఠశాలలు, మరుగు దొడ్లు

మండలంలోని పలు ప్రభుత్వ పాఠశాలలో ఆయాలు ఉన్నా మరుగు దొడ్లను సక్రమంగా శుభ్రం చేయక అపరిశుభ్రంగా దుర్వాసనను వెదజల్లుతున్నాయి. కొన్ని పాఠశాలల్లో మరుగు దొడ్లకు తలుపుల్లేవు. పాఠశాలలకు వస్తున్న బాలికలు మరుగు దొడ్లు లేక, ఉన్నా తలుపులు లేక, అపరిశుభ్రత నెలకొనడంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. సాపే వారి పల్లి జెడ్పీ, ఎంపీపీ పాఠశాలలో మరుగు దొడ్లు లేవు. ఉన్న రెండు మరుగు దొడ్లు అపరిశుభ్రంగా ఉండటంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ప్రతి పాఠశాలలో అపరిశుభ్రంగా మరుగుదొడ్లు దర్శనమిస్తున్నాయి. పాఠశాలలోని తరగతి గదులు, పాఠశాల ఆవరణను శుభ్రం చేయకపోవడంతో అపరిశుభ్రంగా ఉన్నాయి. పాఠశాలల పరిసరాల్లో ప్లాస్టిక్ వ్యర్థాలు పేరుకుపోయాయి. శివారు ప్రాంత పాఠశాల భవనాలు మందు బాబులకు అడ్డాగా ఉన్నాయి.

విద్యార్థులకు రక్షిత మంచి నీరు కరవు

మండలంలో విద్యార్థులకు అవసరమైన కనీస వసతుల్లో ఒకటైన రక్షిత మంచి నీరు లేక విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. సాపేవారిపేట పాఠశాలలో రక్షిత మంచి నీరు లేదు. ట్యాప్ వాటర్‌ను మాత్రమే విద్యార్థులకు అందిస్తున్నారు. అధిక సంఖ్యలో పాఠశాలల్లో రక్షిత మంచి నీరు లేదు. రక్షిత మంచి నీటి ఫిల్టర్లు శుభ్రంగా లేవు. మండలంలో ఇద్దరు ఎంఈఓలు ఉన్నారు. ఎంఈఓ -1 ఇన్‌చార్జి కావడంతో ఎంఈఓ-2 బాధ్యతలు చూస్తున్నారు. సంబంధిత విద్యాశాఖ అధికారి పర్యవేక్షణ లేకపోవడంతో విద్యావ్యవస్థ అస్తవ్యస్తంగా ఉంది.

> **ప్రతి పాఠశాలలో ఆయాలున్నారు**
>
> ప్రతి పాఠశాలలోను మరుగుదొడ్లను శుభ్రం చేసేందుకు ఆయాలను ఏర్పాటు చేసాం. అపరిశుభ్ర పరిసరాలను, మరుగుదొడ్లను ఆయాలతో శుభ్రం చేయించుకోవాల్సిన బాధ్యత ఉపాధ్యాయులపై ఉంది.
>
> – ఎం.వెంకటరమణ, ఎంఈఓ 2, కాట్రేనికోన

చిన్నారులను పాఠశాలల్లో చేర్పించండి



మొల్లేటిమొగ ప్రాథమిక పాఠశాలలో అడ్మిషన్ కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న సర్వశిక్షా అభియాన్ సీఎంఓ సుబ్రహ్మణ్యం

కాట్రేనికోన: ప్రభుత్వ బడుల్లో పిల్లలను చేర్పించాలని వారికి చక్కని విద్యా బోధన అందించేందుకు ఉపాధ్యాయులు సిద్ధంగా ఉన్నారని జిల్లా సర్వశిక్షా అభియాన్ సీఎంఓ బీవీవీ సుబ్రహ్మణ్యం పిలుపునిచ్చారు. పాఠశాలలో విద్యార్థులు అడ్మిషన్ ప్రారంభోత్సవం కార్యక్రమానికి సీఎంఓ బీవీవీ సుబ్రహ్మణ్యం మొల్లేటిమొగ పాఠశాలకు ఉదయం 8 గంటలకు పాఠశాలకు రాగా ఎంఈఓ-2 ఎం. వెంకటరమణ 10 గంటలకు రావడంతో ఆయన వేచి ఉన్నారు. మండలంలోని మొల్లేటిమొగ మండల ప్రజాపరిషత్ ఆదర్శ ప్రాథమిక పాఠశాలలో 2025-26 విద్యా సంవత్సరానికి అడ్మిషన్ కరపత్రాలను ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా విద్యార్థులు, తల్లిదండ్రులు, గ్రామ ప్రజలకు అవగాహన సదస్సు నిర్వహించారు. అనంతరం ర్యాలీ చేపట్టి ఇంటింటికీ వెళ్లి అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ-2 ఎం.వెంకటరమణ, ప్రధానోపాధ్యాయుడు ఎంవీ ప్రసాద్, సీఆర్పీలు కొప్పిశెట్టి నాగభూషణం, పాము రవికుమార్, అంగన్వాడీ కార్యకర్తలు విద్యాకమిటీ చైర్మన్ పాల్గొన్నారు.

అలరిస్తున్న సాంస్కృతిక ప్రదర్శనలు

అమలాపురం టౌన్: అమలాపురం వేంకటేశ్వర స్వామి కల్యాణోత్సవాల్లో భాగంగా దేవస్థానం ప్రాంగణంలో రోజూ సాయంత్రం నిర్వహిస్తున్న వివిధ సాంస్కృతిక ప్రదర్శనలు భక్తులను ఆకట్టుకుంటున్నాయి. ముఖ్యంగా చిన్నారులు నృత ప్రదర్శనలు రంజింపజేస్తున్నాయి. యానాం శ్రీదత్త సాయి చిల్డ్రన్స్, నృత్య గురువు నల్లా హైమావతి బృందం ప్రదర్శిస్తున్న కూచిపూడి నృత్యం, పాశ్చాత్య నృత్యం అందరినీ ఆకట్టుకుంటున్నాయి. రాజమహేంద్రవరం శ్రీ లక్ష్మీ శ్రీనివాస కూచిపూడి నృత్యాలయం విద్యార్థినులు కూచిపూడి నృత్య రూపకాలను ప్రదర్శిస్తున్నారు. నృత్య గురువు కసిరెడ్డి రమేష్ నాయుడు ఆధ్వర్యంలో ఈ ప్రదర్శనలు కొనసాగుతున్నాయి. అమలాపురం శ్రీ కళా క్షేత్రం విద్యార్థినులు కూడిపూడి నృత్య ప్రదర్శనలు కనుల విందుగా సాగుతున్నాయి. కోలాటం ప్రదర్శన రోజూ లయబద్ధంగా, మధురమైన భక్తి గీతాలాపన నడుమ ఆహ్లాదంగా, ఆనందభరితంగా కొనసాగుతున్నాయి. నృత్య ప్రదర్శన చేసిన చిన్నారులను మంత్రి వాసంశెట్టి సుభాష్, ఎంపీ గంటి హరీష్ మాధూర్ ప్రత్యేకంగా అభినందించారు. దేవస్థానం ఉత్సవ కమిటీ చైర్మన్ జంగా అబ్బాయి వెంకన్న, ఈవో యర్రా వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఈ సాంస్కృతిక ప్రదర్శనల్లో ప్రతి రోజూ నృత్య కళాకారులను అభినందిస్తూ ధ్రువీకరణ పత్రాలు అందిస్తున్నారు.



అమలాపురం వెంకన్న కల్యాణోత్సవాల్లో కూచిపూడి నృత్య ప్రదర్శన



అమలాపురం వెంకన్న దేవస్థానంలో అందుకున్న ధృవీకరణ పత్రాలతో కూచిపూడి నృత్య కళాకారిణులు

ఫ్రెంచ్ పౌరుల పాస్‌పోర్టుల పునరుద్ధరణ

యానాం: పుదుచ్చేరి ఫ్రెంచి కాన్సులేట్ కాన్సులర్ ఆఫీసర్ మేడమ్ ఫ్రాంకోయిస్ బుధవారం యానాం విచ్చేసారు. ఈ సందర్భంగా స్థానిక రీజెన్సీ హోటల్‌లో యానాం ఫ్రెంచి పౌరుల ప్రతినిధి సాధనాల బాబు తదితరులు ఆమెకు ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం యానాంలో నివాసం ఉంటున్న ఫ్రెంచి పౌరుల పాత పాస్‌పోర్టుల పునరుద్ధరణ, ఫ్రెంచి పౌరులకు గుర్తింపు కార్డులు, యానాం ఫ్రెంచ్ పెన్షనర్లకు లైఫ్‌సర్టిఫికెట్ల జారీ వంటి సేవలను అందించారు. ఫ్రెంచ్ పౌరులు పుదుచ్చేరి వెళ్లకుండానే పుదుచ్చేరి ఫ్రెంచ్ కాన్సులేట్ సంవత్సరానికి రెండుసార్లు యానాం వస్తారని అన్నారు. యానాంలో సుమారు 100 ఫ్రెంచి కుటుంబాలు జీవిస్తుండటంతో వారికి పలు సేవలు అందిస్తున్నారు.



యానాంలో ఫ్రాంకోయిస్‌కు స్వాగతం పలికిన ఫ్రెంచి పౌరులు

సంస్కారభారతికి నూతన కార్యవర్గం

అమలాపురం రూరల్: సంస్కారభారతికి నూతన కార్యవర్గ బాధ్యతల స్వీకరణ కార్యక్రమం అమలాపురం ఈదరపల్లి జనహిత భవన్‌లో ఆకొండి పవన్ కుమార్ అధ్యక్షతన బుధవారం జరిగింది. ప్రాంత ఉపాధ్యక్షురాలు వేదనభట్ల సాయిలక్ష్మి నూతన కార్యవర్గాన్ని ప్రకటించారు. నూతన అధ్యక్షురాలిగా శ్రీగిరి పద్మావతి, కార్యదర్శిగా వలవల వెంకట రెడ్డి నాయుడు, కోశాధికారిగా ఈవని సాయికృష్ణ, ఉపాధ్యక్షుడిగా కూచిమంచి కృష్ణ, సహ కార్యదర్శులుగా గోటేటి గంగాధరరావు, బూరగాయల శివరామకృష్ణ బాధ్యతలు స్వీకరించారు. ప్రధాన కార్యదర్శి పుత్సా కృష్ణ కామేశ్వర్ తమ హయాంలో మూడేళ్లలో నిర్వహించిన కార్యక్రమాల నివేదిక అందజేశారు. ఈ కార్యక్రమంలో మాకిరెడ్డి పూర్ణిమ, భమిడిపాటి సుగుణ,పెన్షనర్స్ అసోసియేషన్ గౌరవాధ్యక్షుడు సాయి వరప్రసాద్, వాకర్స్ జిల్లా గవర్నర్ సప్పా నాగేశ్వరరావు, కృష్ణవేణి, బలరామకృష్ణ తదితరులు నూతన కార్యవర్గాన్ని సత్కరించారు.



సంస్కారభారతికి ఎన్నికైన నూతన కార్యవర్గం

కోదండరామునికి చక్రస్నానం

యానాం: స్థానిక కనకాలపేటలో కొలువైన కోదండ రామస్వామి ఆలయంలో 78వ శ్రీరామనవమి ఉత్సవాలను పురస్కరించుకుని ఈనెల 5 నుంచి బుధవారం వరకు కల్యాణ మహోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామివారికి చక్రస్నానం గౌతమీగోదావరి వద్ద వైభవంగా నిర్వహించారు. పలువురు భక్తులు, యాళ్ల లక్ష్మణరావు తదితరులు పాల్గొన్నారు.

వైద్యుల నియామకానికి 23న ఇంటర్వ్యూలు

యానాం: కేంద్ర ప్రభుత్వ నిధులు రూ.40కోట్ల వ్యయంతో యానాంలో నిర్మించిన జవహర్‌లాల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ పోస్టుగాడ్యుయేట్ మెడికల్ ఎడ్యుకేషన్ అండ్ రీసెర్చ్ (జిప్‌మెర్) ఆసుపత్రిలో వైద్యుల నియామకానికి ఈనెల 24 బుధవారం ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నట్లు సీనియర్ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ తెలిపారు. ఈ సందర్భంగా స్పెషలిస్ట్ గ్రేడ్-2, జనరల్ డ్యూటీ డిప్యూటీ మెడికల్ ఆఫీసర్స్‌ను కాంట్రాక్టు ప్రాతిపదికన నియామకం కోసం ఇప్పటికే ఇంటర్వ్యూలకు అర్హులైన వారి జాబితాను ప్రకటించామన్నారు. అభ్యంతరాలను ఈనెల 12లోగా జిప్‌మెర్.కాంట్రాక్టు ఎట్‌ది రేట్ ఆఫ్ జీమెయిల్‌కు పంపాలని కోరారు. స్పెషల్‌గ్రేడ్‌కు ఒకరు, జనరల్ డ్యూటీ మెడికల్ ఆఫీసర్స్‌కు 18 మంది ఇంటర్వ్యూలకు అర్హత సాధించారన్నారు.

మత్స్యకారుల లైఫ్ సర్టిఫికెట్ల పరిశీలన

యానాం: నియోజకవర్గ పరిధిలో పింఛను తీసుకుంటున్న మత్స్యకార లబ్ధిదారుల లైఫ్ సర్టిఫికెట్ల పరిశీలన కోసం ఈనెల 11నుంచి 21వ తేదీ వరకు మత్స్యశాఖ అధికారులు ఆయా గ్రామాల్లో పర్యటిస్తారని బుధవారం ఆశాఖ ఏడీ దడాల గొంతియ్య తెలిపారు. పెన్షన్‌దారులు తమ వద్ద ఆధార్, రేషన్, ఓటు గుర్తింపుకార్డులు, పెన్షన్ తీసుకుంటున్న బ్యాంకు అకౌంట్ జిరాక్స్‌లు, పాస్‌పోర్టు సైజ్ ఫొటో దగ్గర ఉంచుకోవాలని వాటిని అధికారులకు సమర్పించాలని కోరారు. 11న కనకాలపేట, అగ్రహారం, కొత్తపేట, 15న మెట్టకూరు, ఫ్రాన్స్‌తిప్ప, ఓల్డ్‌రాజీవ్ నగర్, 16న కురసాంపేట, అయ్యన్ననగర్, దరియాలతిప్ప, 17న గిరియాంపేట, 21న సావిత్రినగర్‌కు అధికారులు వచ్చి పరిశీలిస్తారన్నారు.

మహిళలకు కుట్టు మెషీన్ల పంపిణీ

ఉప్పలగుప్తం: సరిపల్లిలోని తామరచెరువుపేటలో ఆల్ ఇండియా ఓఎన్జీసీ ఎస్సీ, ఎస్టీ ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్, రాజమండ్రి వారి ఆర్థిక సహకారంతో సర్పంచ్ గెద్దం స్వరూపరాణి ఆధ్వర్యంలో 30 మంది మహిళలకు బుధవారం కుట్టు మెషీన్లు అందజేశారు. ఈ సందర్భంగా సంస్థ చైర్మన్ కొమ్ము సత్యనారాయణ ఉచిత టైలరింగ్ శిక్షణ కేంద్రాన్ని బుధవారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ గెద్దం సురేష్‌బాబు, రవీంద్ర, ఎస్. రాజుకుమార్ తదితరులు పాల్గొన్నారు.



సరిపల్లిలో కుట్టు మెషీన్లు అందుకున్న మహిళలు

ఉపాధి హామీ ఉద్యోగులకు సత్కారం

ఉప్పలగుప్తం: కొన్నేళ్లుగా మహాత్మాగాంధీ ఎన్ఆర్ ఈజీఎస్ సంస్థలో ఉద్యోగులుగా అంకితభావంతో పనిచేసి పలు ప్రాంతాలకు బదిలీపై వెళ్తున్న కార్యాలయ ఉద్యోగులను ఎంపీడీవో పీఆర్‌సీ రాజ్‌కుమార్ ఆధ్వర్యంలో సిబ్బంది బుధవారం ఘనంగా సత్కరించారు. ఉపాధి ఏపీవోగా పనిచేస్తున్న వి.రాజామణి, టీఏ ఎం.దేవిపార్వతీ, సీఓలు వి.నాగేంద్ర బాబు, జి.రవీంద్రబాబుకు స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో వీడ్కోలు సభ నిర్వహించి, పూలమాలలు, దుశ్శాలువాలతో సత్కరించి జ్ఞాపికలను అందజేశారు. ఇన్‌ఛార్జ్ ఏపీఓ ఎం.వీరబాబు, కార్యాలయ ఏవో ఎమ్.మూర్తి పాల్గొన్నారు.

ఫుట్‌బాల్ ప్రధాన కోచ్‌గా రిషిరాజ్ ఎంపిక

యానాం: ఈనెల 10నుంచి ఛత్తీస్‌ఘడ్‌లో నిర్వహించే అండర్-20 జాతీయ ఫుట్‌బాల్ చాంపియన్ షిప్ పోటీలకు తెలంగాణ ఫుట్‌బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలోని రాష్ట్ర జట్టుకు యానాంకు చెందిన దారా రిషిరాజ్ పృథ్వీ ప్రధాన కోచ్‌గా ఎంపికయ్యారు. 16 మంది సభ్యులు గల తెలంగాణ జట్టుకు రిషిరాజ్ ప్రధాన కోచ్‌గా, మేనేజర్‌గా జోయ్‌సామ్యూల్ పురుషోత్తం, ఫిజియోగా బొడ్డు అప్పన్న వ్యవహరించనున్నారు. ఈ మేరకు నియామక ఉత్తర్వులు అందాయని రిషిరాజ్ తెలిపారు. పలువురు ఆయనను అభినందించారు.

శ్మశాన వాటిక ఆధునీకరణకు విరాళం

తాళ్లరేవు: స్థానిక పెంకేవారిపేటలోని శ్మశాన వాటిక అభివృద్ధికి స్థానిక దేవీమహల్ సెంటర్‌లోని గణేష్ జ్యూవెలర్స్ షోరూం అధినేతలు మందారపు సత్తిబాబు, బ్రదర్స్ రూ.లక్ష విరాళాన్ని బుధవారం అందజేసారు. లయన్స్‌క్లబ్ సిల్వర్ జూబ్లీ వారోత్సవాల్లో భాగంగా సుమారు రూ.50 లక్షల వ్యయంతో అభివృద్ధి చేస్తున్న శ్మశాన వాటికకు సత్తిబాబు బ్రదర్స్ తమవంతు సహాయం అందజేశారని క్లబ్ అధ్యక్షుడు పొన్నాడ పేరయ్యరాజు తెలిపారు. క్లబ్ ప్రతినిధులు బిళ్లకుర్తి శ్రీనివాసరెడ్డి, నడింపల్లి వినోద్, గాదిరాజు సతీష్‌రాజు తదితరులు దాతలను సత్కరించారు.

ఘనంగా శివరామదీక్షిత జయంతి

తాళ్లరేవు: కోరంగి పంచాయతీ బొడ్డుచిన వెంకటాయపాలెం అచలరుషి నిర్మలాశ్రమంలో శివరామదీక్షిత జయంతిని ఘనంగా బుధవారం నిర్వహించారు. నిర్మలాశ్రమం కార్యనిర్వాహక కార్యదర్శి బొడ్డు సత్యనారాయణ పర్యవేక్షణలో ఆలిండియా సేవా సమాఖ్య అధ్యక్షుడు గొల్లగూడెంకు చెందిన నాగుల వెంకటేశం అధ్యక్షతన విశేష పూజలు నిర్వహించారు. ఆశ్రమ అధ్యక్షుడు సమరసానంద బొడ్డు కృష్ణమాచార్యులు ఆధ్వర్యంలో గురుపూజోత్సవాన్ని భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన వేదాంత సభలో ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, ఒడిశా, కర్ణాటక రాష్ట్రాల నుంచి హాజరైన గురువులు తమ సందేశాలను ఇచ్చారు. వివిధ ప్రాంతాల నుంచి గురువులు, భక్తులు పాల్గొన్నారు.



బొడ్డుచిన వెంకటాయపాలెంలో వేదాంత సభలో మాట్లాడుతున్న బొడ్డు కృష్ణమాచార్యులు

అంబేడ్కర్ ఆదర్శనీయుడు

యానాం: నేటి యువతకు రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఆదర్శనీయుడని ప్రిన్సిపాల్ డాక్టర్ వరుగు భాస్కరరెడ్డి పేర్కొన్నారు. బుధవారం డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో పుదుచ్చేరి ప్రభుత్వ జాతీయ సేవా పథకం ఆదేశాల మేరకు యూనిట్-1, 2 ప్రోగ్రామ్ ఆఫీసర్లు నరేష్, శ్రీనివాస్ ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన క్విజ్ పోటీల్లో విజేతలైన విద్యార్థులకు బహుమతులు అందజేశారు.

చిన్నారులకు పోషకాహారాన్ని సక్రమంగా అందించాలి

అమలాపురం టౌన్: అంగన్‌వాడీ కేంద్రాల్లో మెనూ ప్రకారం ఆహార పదార్థాలను చిన్నారులకు అందించి, వారికి పోషకాహార లోపం నివారణకు కృషి చేయాలని స్థాయిని మెరుగుపరచాలని రాష్ట్ర ఆహార కమిషన్ సభ్యుడు జక్కంపూడి కృష్ణకిరణ్ అన్నారు. అంగన్‌వాడీ కేంద్రాల సిబ్బంది ప్రత్యేక శ్రద్ధతో చిన్నారుల ఆరోగ్యానికి బాటలు వేయాలని ఆయన సూచించారు. స్థానిక మెట్ల కాలనీలోని కోడ్ నంబర్- 282 అంగన్‌వాడీ కేంద్రాన్ని కిరణ్ జిల్లా అధికారులతో కలిసి బుధవారం ఉదయం ఆకస్మికంగా తనిఖీ చేసి ఆ కేంద్రం సిబ్బందితో మాట్లాడారు.

ఈ సందర్భంగా అంగన్‌వాడీ కేంద్రం రికార్డులను ఆయన తనిఖీ చేశారు. మెనూ ప్రకారం ఆహారం అందుతుందో లేదో ఆరా తీశారు. అంగన్‌వాడీ కార్యకర్త విజయకు పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో డీఎస్‌ఓ అడపా ఉదయభాస్కర్, పౌర సరఫరాల జిల్లా మేనేజర్ బాల సరస్వతి, తూనికలు, కొలతల శాఖ కంట్రోలర్ రాజేష్, డీఎం అండ్ హెచ్‌ఓ డాక్టర్ ఎం.దుర్గారావు దొర తదితరులు పాల్గొన్నారు.



అల్లవరం హైస్కూల్లో 300 నిల్వ గుడ్లు

అల్లవరం హైస్కూల్లో ఆకస్మిక తనిఖీ

అల్లవరం: అల్లవరం ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు అందిస్తున్న డొక్కా సీతమ్మ మధ్యాహ్నం భోజనం పథకం నిర్వహణ సక్రమంగా లేదని, బియ్యం లెక్కలకు పొంతన లేకుండా ఉందని, మెనూ పాటించడం లేదని రాష్ట్ర ఆహార కమిషన్ సభ్యుడు జక్కంపూడి కిరణ్ అన్నారు. అల్లవరం ఉన్నత పాఠశాల మధ్యాహ్న భోజన పథకం పనితీరుని బుధవారం పౌరసరఫరాల శాఖ అధికారులతో కలసి ఆయన ఆకస్మిక తనిఖీ చేశారు. అల్లవరం హైస్కూల్లో గత నెలలో ఇవ్వవలసిన 300 గుడ్లు నిల్వ ఉన్నట్లు గుర్తించారు. దీనిపై పాఠశాల హెచ్‌ఎం ఎస్.వెంకటేశ్వరరావు, భోజన పథకం నిర్వాహకులను ప్రశ్నించారు. బుధవారం మెనూలో 253 మంది విద్యార్థులకు భోజనాలు తయారు చేసినట్టుగా రికార్డుల్లో నమోదు చేశారు. క్షేత్రస్థాయిలో 50 మంది విద్యార్థులకు ఆహార పదార్థాలు తయారు చేసినట్లుగా గుర్తించారు. క్షేత్రస్థాయిలో విద్యార్థులకు వండిన ఆహార పదార్థాలు, రికార్డుల్లో నమోదు చేసిన వివరాల్లో చాలా వ్యత్యాసం ఉండడంతో పాఠశాల హెచ్‌ఎంని ఫుడ్ కమిషన్ సభ్యుడు కిరణ్ ప్రశ్నించారు. మధ్యాహ్న భోజనం పథకం అమలులో అవకతవకలను గుర్తించి పాఠశాల హెచ్‌ఎం, ప్రాజెక్టు పీడీలకు షోకాజ్ నోటీసులు ఇవ్వాలని విద్యా శాఖ ఏడీకి ఆదేశాలు జారీ చేశారు. అల్లవరం సడక్ రోడ్డులోని పాఠశాలలో భోజనం పథకం అమలును పరిశీలించారు. విద్యార్థులకు వండే ఆహార పదార్థాల్లో ఎక్కువగా కారం వినియోగించారని నిర్వాహకులపై మండిపడ్డారు. అల్లవరంలో రేషన్ డిపో, అంగన్‌వాడీ కేంద్రాలను ఆయన పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. డీఎస్‌ఓ అడపా ఉదయభాస్కర్, జిల్లా మేనేజర్ బాల సరస్వతి, ఎంఈఓ ఏడుకొండలు పాల్గొన్నారు.

చెస్ క్రీడాకారిణి సంధ్యకు ఎంపీ అభినందన



చెస్ క్రీడాకారిణి సంధ్యను అభినందిస్తున్న ఎంపీ హరీష్ మాథూర్

అమలాపురం టౌన్: చెస్ క్రీడాకారిణి గోలి సంధ్య జాతీయ పోటీల్లో సత్తా చాటినట్లే అంతర్జాతీయ పోటీల్లో సైతం మరిన్ని విజయాలు సాధించాలని అమలాపురం ఎంపీ గంటి హరీష్ మాథూర్ ఆకాంక్షించారు. విజయవాడకు చెందిన సంధ్య అమలాపురంలోని ఎంపీ క్యాంపు కార్యాలయంలో హరీష్ మాథూర్‌ను బుధవారం కలిశారు. ఇటీవల గుజరాత్ రాష్ట్రం అహ్మదాబాద్‌లో నిర్వహించిన జాతీయ చెస్ మహిళా టీమ్ చాంపియన్ షిప్ పోటీల్లో సంధ్య కాంస్య పతకాన్ని సాధించారు. క్రీడాకారిణి సంధ్యను, ఆమె కుటుంబ సభ్యులను ఎంపీ అభినందించారు.

బీజేపీ క్రియాశీలక సభ్యుల సమావేశం

అమలాపురం రూరల్: ప్రపంచంలోనే అతిపెద్ద పార్టీగా బీజేపీ అవతరించిందని అనకాపల్లి జిల్లా ఇన్‌చార్జి కర్రి చిట్టిబాబు, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పాలూరి సత్యానందం అన్నారు. బీజేపీ అమలాపురం అసెంబ్లీ క్రియాశీలక సభ్యుల సమావేశం అమలాపురంలో కోనసీమ జిల్లా బీజేపీ కార్యాలయంలో బుధవారం అమలాపురం అసెంబ్లీ కన్వీనర్ బీఎస్ మూర్తి అధ్యక్షతన నిర్వహించారు. ముఖ్య అతిథులుగా చిట్టిబాబు, సత్యానందం హాజరయ్యారు.ఈ కార్యక్రమానికి జిల్లా ప్రధాన కార్యదర్శి మోకా వెంకటసుబ్బారావు, మహిళా మోర్చా జిల్లా అధ్యక్షురాలు చిలకమర్తి కస్తూరి, రూరల్ మండల అధ్యక్షుడు బొంతు శివాజీ, నగర ప్రధాన కార్యదర్శి దాట్ల వెంకట సుబ్బరాజు పాల్గొన్నారు.